"ఏమండోయ్... నాకు 'బంగారు వర్షం' ప్రోగ్రామ్‌లో పది గ్రాముల బంగారం బహుమతి వచ్చింది." అంది విశాలి ఆఫీసు పనిలో అలిసిపోయి రాత్రి తొమ్మిదిన్నరకు వచ్చిన భర్తతో. ఆమె ముఖం మెర్క్యురీ బల్బ్‌లా వెలిగిపోతోంది.

"వెరీగుడ్, గొడవొదిలింది. సెల్‌లో యస్.యమ్.యస్‌లు చేయడానికి ఇప్పటికి కొన్ని వేలు ఖర్చయి వుంటుంది" అన్నాడు దీర్ఘంగా నిట్టూరుస్తూ.

"అది సరేగానీ వాళ్ళు మనల్ని పది గ్రాముల బంగారం తీసుకోడానికి ఫోన్ చేసి పిలుస్తారంట. అప్పుడు మనం బంగారం తీసుకొంటూంటే వీడియో తీసి టీవీలో చూపిస్తారట. మీరు కూడా ఆ టైమ్‌లో వుండాలిస్మీ అంది విశాలి.

"అంతా బాగానే వుంది గానీ, జాగ్రత్తగా వుండు. ఎవడైనా వచ్చి తలుపు తట్టి మేము పది గ్రాముల బంగారం ఇవ్వడానికి వచ్చేమంటే, ఎగురుకుంటూ వెళ్ళి వెంటనే తలుపు తీసేవు కొంపమునుగుతుంది." అన్నాడు భర్త.

"ఛ. మీరు ఇలాగే అన్నీ అపశకునం మాటలు మాట్లాడతారు" అంది విశాలి.

మర్నాడు విశాలి భర్త ఆఫీసుకు వెళ్ళినవెంటనే, రెండు పూటలకూ వంట చేసి పారేసి, "బంగారు వర్షం" ఫోన్ కోసం ఎదురుతెన్నులు చూడసాగింది.



# బంగారు వర్షం

ఈలోగా వీధిలో నిలబడి దాదాపు గ్రామ పంచాయితీలో టముకు వేసినట్టుగా ఆ వీధి అంతా అమ్మలక్కలకు తెలియజేసింది తన బహుమతి గురించి.

మరో తొమ్మిదిసార్లు గెలిస్తే మొత్తం వంద గ్రాములకు చిన్న సైజు వడ్డాణం చేయించుకోవచ్చు. నడుము లావై పోకుండా డైటింగ్ చేయాలి అని ఆలోచిస్తూ, వంద గ్రాముల బంగారం గెలుచుకున్నందుకుగాను, తనను మహిళామండలి వాళ్ళు సన్మానిస్తున్నట్టుగా పంచరంగుల కలలోకి వెళ్ళిపోయింది విశాలి.

ఇంతలో ఎవరో తలుపు తట్టారు.

పరుగుతో వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా ఒక వ్యక్తి చేతిలో టీవీ పేరుతో మౌత్‌పీస్, రెండో వ్యక్తి చేతిలో వీడియో కెమెరా, ఇంకొక అమ్మాయి భలే స్టయిల్‌గా వుంది.

ఆమె విశాలిని ఉద్దేశించి -

"మేడమ్. విశాలిగారు మీరేనా?"

"అవునండీ..." అంది విశాలి. ఆమె ముఖం సన్ ఫ్లవర్‌లా వెలిగిపోతోంది.

"రాత్రి బంగారు వర్షం ప్రోగ్రాంలో మీరు పదిగ్రాముల బంగారం గెలిచారు గదా. మీకు బంగారం ఇవ్వడానికి వచ్చేం."అంది ఆ అమ్మాయి వళ్ళంతా తిప్పేసుకుంటూ, చిలక పలుకులతో-

"సాయంత్రం మావారు కూడా వస్తారు. అప్పుడు తీసుకుంటాను. మేమిద్దరం టీవీలో కనపడాలి." అంటూన్న ఆమెను ఇంట్లోకి తోసుకుంటూ ముగ్గురూ ఇంట్లోకి ప్రవేశించారు.

"ఏమిటిది?" అందోన్న ఆమెను సోఫాలో కూలద్రోసి, చేతులు వెనక్కి కట్టేసి, బీరువా తాళాలు ఇవ్వకపోతే నాలుగు తగిలించి, బీరువా తాళాలు తెరిచి మొత్తం దోచుకుని, ఆమె నోటికి ప్లాస్టర్ అంటించి, తలుపులు జాగ్రత్తగా మూసి వెళ్ళిపోయారు.

సాయంకాలం భర్త వచ్చేడు. పరిస్థితి చూసి, "బంగారు వర్షం కురిసిందన్నమాట. నేను అనుకుంటూనే వున్నాను... మళ్ళా ఎక్కడ యస్. యమ్. యస్. లు ఇస్తావోనని భయంతో సెల్ తీసుకువెళ్ళడం పొరబాటైపోయింది" అంటూ ఆమె కట్లు విప్పి. నోటిమీద టేప్‌తీసి, లోపలకువెళ్ళి తెరిచిడన్న బీరువా చూసి ధామ్మని పడిపోయాడు.

"ఏమండీ" అంటూ విశాలి భర్త దగ్గరకు ఆందోళనతో వెళ్ళింది. రాత్రి టీవీలో మేము ఫోన్ చేసే వరకూ కంగారు పడకండి. ఎవరైనా వచ్చి బంగారం ఇస్తామన్నా మోసపోకండి" అని మరీ మరీ చెప్పిన మాటలు సూచాయగా గుర్తుకు వస్తున్నాయిప్పుడు పాపం విశాలికి. ●

**కె.బి. కృష్ణ**